# సింగిల్ పేజీ కథలు

## ఊపిరి సలపని గాలి

అప్పలకొండ చిన్నప్పట్నుంచీ భయస్థుడు. కష్టపడి చదువుకున్నాడు. తండ్రి పైడికొండ అసలు చదువుకోలేదు. అయినా తన కొడుకు పెద్ద చదువులు చదవాలనీ, బాగా పైకొచ్చి పెద్ద ఉద్యోగం చెయ్యాలనీ, అతని కోరిక. చిన్నప్పట్నించీ స్కూల్లో టీచర్లన్నా, యింట్లో తల్లిదండ్రులన్నా అప్పలకొండకి చాలా భయం. ఒకసారి యింట్లో పాఠం చదువుతూ, "భూమి గుండ్రంగా వుండును" అని చదువుతూన్నాడు అప్పలకొండ.

పైడితల్లి చాలా నిజాయితీ గలవాడు. "వెధవా! భూమి బల్లపరుపుగా వుంటే గుండ్రంగా వుంది అని చదువుతావా! వెధవ అబద్ధాలు నువ్వూనూ!" అని చావ కొట్టి, "భూమి బల్లపరుపుగా వుండును" అని చదివించాడు.

కొన్నాళ్ళ తర్వాత అప్పలకొండ చదువుతూన్న స్కూలుకి స్కూళ్ళ యిన్‌స్పెక్టర్ వచ్చారు. ఆయన తనిఖీ చేస్తూ "భూమి ఎలా వుండును?" అని అప్పలకొండని ప్రశ్నించారు. అప్పలకొండ లేచి నిలబడి, చేతులు కట్టుకుని, "భూమి యింట్లో బల్లపరుపుగానూ, స్కూల్లో గుండ్రంగానూ వుండును" అని భోరుమని ఏడ్చేసాడు. ఇన్‌స్పెక్టరుగారి మనసు వికలమైపోయింది.

"ఈ భూమి స్వరూపం ఒక్కొక్కచోట ఒక్కొక్కలా ఎందుకుంది?" అని హెడ్ మాస్టార్ని అడిగి అసలు విషయం తెలుసుకుని, ఈ అప్పలకొండ తండ్రి పైడితల్లిని, వయోజన విద్యలో ప్రవేశపెట్టమన్నాడు. తర్వాత ఎక్కడ జరిగినదానికి అక్కడే ఏడవాలనీ, యింట్లో తండ్రి కొడితే స్కూల్లో ఏడవకూడదని, అలాగే స్కూల్లో టీచర్లు కొడితే స్కూల్లోనే ఏడావాలి కానీ, యింట్లో ఏడవకూడదని చెప్పారు యిన్‌స్పెక్టర్. హెడ్‌మాస్టారు వైపు తిరిగి "మా ఆవిడ అస్తమానూ యింట్లో ఏడుస్తూంటే తప్పించుకుందామని క్యాంప్‌లో వస్తే, యిక్కడా ఏడుపులే! అసలు నా ఖర్మ! అసలా ప్రశ్నే ఎందుకు వెయ్యాలి నేను!" అన్నారు యిన్‌స్పెక్టర్.

"మీరు అదృష్టవంతులు సార్! మీ ఆవిడ ఏడిస్తే మీకు క్యాంప్ వెళ్ళే అవకాశం వుంది! మా ఆవిడ అస్తమానూ యింట్లో ఏడిపించేస్తోంది. నాకు ఈ క్యాంప్‌కెళ్ళే అవకాశం కూడా లేదు!" అని స్వగతంగా అనుకుంటూ, "అవును సార్! చిత్తం!" అన్నారు పైకి హెడ్‌మాస్టర్.

ఒకసారి సైన్స్‌మాస్టారు, ఒక గాజుగ్లాసు బోర్లించి మళ్ళీ మామూలుగా పెట్టి, "యిందులో ఏముంది?" అని అడిగారు. అప్పలకొండ లేచి, అందులో ఏం లేదనీ, ఖాళీగా వుందని చెప్పాడు.

సైన్స్‌మాస్టారు "అదే తప్పు" అని గట్టిగా అరిచి "యిందులో గాలి వుంది" "ఎప్పుడూ కూడా ఖాళీగా వుందని చెప్పకూడదు" అన్నారు.

అలా అలా అప్పలకొండ విద్యాభ్యాసం ముగిసింది. తర్వాత పెళ్ళైంది. కొత్తకాపురం, శ్రీమతి అప్పలకొండ నెలసరుకులు సర్దుతూ ఒక రేకు డబ్బా చూపించి, "అది ఖాళీగా వుంటే యిలా యివ్వండి! ఈ ఆవాలు అందులో పోస్తాను" అంది.



తన సైన్సు విజ్ఞానాన్ని భార్యకి తెలియపరుద్దామని, "ఈ డబ్బా ఖాళీ లేదు" అన్నాడు.

తర్వాత ఆ డబ్బా చూసి, "ఏమిటి ఏమైనా వేళాకోళమా! ఖాళీగా వున్న డబ్బా ఖాళీలేదంటారేం?" అని గుడ్లురుమింది.

గొప్పగా, "ఇందులో గాలి వుంది! చిన్నప్పుడు మా సైన్స్ మాస్టారు చెప్పారు" అన్నాడు అప్పలకొండ.

నిన్నగాక మొన్న ఈ డబ్బా కొన్నాం కదా! మీరు స్కూల్లో చదువుకునే రోజుల్లో యిదే డబ్బాలో గాలి వుందని మీ మాస్టారు ఎలా చెప్పారు? అన్నీ గాలి కబుర్లూ మీరునూ! స్కూల్లో చదివింది వేరు, జీవితం వేరు. ఇకపై యిటువంటి వెర్రి వేషాలు వెయ్యకండి" అని గట్టిగా మందలించింది శ్రీమతి అప్పలకొండ.

ఒకసారి అప్పలకొండ హాల్లో కూర్చున్నాడు. వంటింట్లోంచి శ్రీమతి, "ఏం చేస్తున్నారు అక్కడ!" అని గట్టిగా అరిచింది.

"ఏం చెయ్యడం లేదు" అన్నాడు అప్పలకొండ.

గబగబా వచ్చి "ఏం చెయ్యకపోవడం ఏమిటి? వెధవ అబద్ధాలూ మీరూనూ! గాలి పీల్చి వదులుతున్నారు కదూ! అసలు సైన్స్ అంటే యిదీ! ఇకపైన ఎవ్వరైనా ఏం చేస్తున్నారని అడిగితే గాలి పీల్చి వదులుతున్నాను అని చెప్పండి."

ఏమిటో ఈ గాలి బాధలు... చిన్నప్పుడు సైన్స్ మాస్టారేమో ఆ గ్లాసులో గాలి వుంది అన్నారు. ఈవిడేమో గాలి పీల్చి వదులుతున్నానని చెప్పమంటోంది. వీళ్ళకి ఏ గాలైనా సోకిందేమో! ఈ బాధలన్నీ తన మిత్రుడికి చెపుతే, "ఏం భయపడకు అప్పలకొండా! అన్నీ సర్దుకుంటాయి! ఆ వాయుపుత్రుడ్ని ప్రార్థించు" అన్నాడు.

ఒకసారి అప్పలకొండ అత్తగారు, కూతురు కాపురం అజమాయిషీ చెయ్యడానికొచ్చింది. "అమ్మాయీ తీరిక సమయాల్లో అల్లుడుగారేం చేస్తున్నారు" అని అడిగింది ఆవిడ.

తన శ్రీమతి సమాధానం చెప్పేలోపులో అప్పలకొండ అందుకుని, "గాలి పీల్చి వదులుతున్నానండి" అన్నాడు.

అత్తగారు అల్లుడ్ని తేరిపార చూస్తూ "అదేం పెద్ద పనిటయ్యా! సమస్త జీవకోటీ ఎల్లవేళలా చేస్తున్నదే కదా!" అంది.

"ఏమోనండి, మీ అమ్మాయి అలా చెప్పమంది! ఈ గాలి విషయంలో, ఎవ్వరేం చెప్తే అది ఆచరిస్తున్నాను" అన్నాడు అప్పలకొండ.

"ఎవ్వరేం చెపుతే అది వినడమేమిటి? మీ మామగార్లా అయిపోతావు జాగ్రత్త! ఈసారి కనుక యిటువంటి వెర్రి మాటలు వింటే నేను వూరుకోను జాగ్రత్త!" అంది.

'అత్తగారికి కూడా ఏదైనా గాలి సోకిందేమో' అనుకున్నాడు అప్పలకొండ. ఇంతలో పక్కింట్లో అమ్మాయి "ఎచట నుండి వీచెనో ఈ చల్లని గాలి" అని పాడుతోంది.

'మాటలే కాదు, పాటలు కూడా గాలికి సంబంధించినవే!' అనుకున్నాడు అప్పలకొండ. ఎందుకైనా మంచిదని డాబాపైకి వెళ్ళిపోయాడు. అక్కడ సాయం సమయంలో ఏకాంతంగా కూర్చున్న శ్రీమతి అప్పలకొండ "వసంత గాలికి వలపులు రేగ" అనే పాట పరవశించి పాడుకుం

